క్లుప్తంగా

ఆత్మకూర్ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

మరికల్: ఆత్మకూర్ – మరికల్ రహదారిలో కల్వర్టుల నిర్మాణం కోసం రోడ్డును ధ్వంసం చేసి వదిలేశారని, వెంటనే మరమ్మతు చేయించాలని బీజేపీ మండల నాయకులు వేణు, వెంకటేష్, కొండయ్యలు అన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వల్లే రోడ్డు మరమ్మతుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. వాహనదారులు నిత్యం ఈ దారిలో ప్రయాణించ డానికి అవస్థలు పడుతున్నారని, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

ధర్నా విజయవంతం చేయండి



ధన్వాడ: మరికల్ మండలంలోని చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ధన్వాడ మండల కేంద్రంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కమిటీ ప్రతినిధి చక్రవర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇథనాల్ కంపెనీ నుంచి వెలువడే వ్యర్థ పదార్థాల వల్ల నీరు, గాలి, భూమి కలుషితం అవ్వడమే కాకుండా వ్యర్థాలు మన్నె వాగులో కలవడంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని అన్నారు. దీంతో సాగు, తాగునీరు విషపూరితమై ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని అన్నారు.లక్ష్మణ్, రాములు, రామచంద్రయ్య, మధు, మల్లేష్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



ఊట్కూరు: ముస్లింలకు రంజాన్ సందర్భంగా ఊట్కూర్‌లోని మక్కా మసీదులో ఆదివారం అధ్యక్షుడు ఖాజీంహుస్సేన్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. నాయకులు అబ్దుల్, అర్షద్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యసహకార సంఘం కార్యవర్గం ఎన్నిక



కృష్ణా: మండలంలోని ఖాన్‌దొడ్డిలో ఆదివారం మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం జరిగిందని జిల్లా అధికారి అనసూయ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంఘం అధ్యక్షుడిగా నాకలి తిప్పయ్య, ఉపాధ్యక్షుడిగా దుకాణం ఆనంద్, కార్యదర్శిగా అన్నపోళ్ల వెంకటేష్, డైరెక్టర్లుగా అశోక్, వన్నప్ప, తాయప్ప, ఆంజనేయులు, రమేష్, బాలకృష్ణ, బస్వరాజ్, నర్సప్ప, మల్లికార్జున్, హన్మంతును ఎన్నుకున్నట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వార్షిక బడ్జెట్ సమావేశం

నారాయణపేట రూరల్ : పట్టణ శివారులోని లోకాయపల్లి లక్ష్మమ్మ దేవాలయంలో ఆదివారం వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆదాయ, వ్యయాలతో పాటు చేపట్టిన కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. రూ.15,69,000 ఆదాయం దేవాలయానికి రాగా రూ. 13,52,525 ఖర్చు చేసినట్లు లెక్కలు చూయించారు. అదేవిధంగా నవగ్రహాలు, కాళమ్మతల్లి, నాగదేవతల విగ్రహాలను ప్రతిష్ఠించామని, బండలు వేయడం, తాగునీటి సౌకర్యం, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టినట్లు తెలియజేశారు. ప్రస్తుత కమిటీ యథాతథంగా కొనసాగేటట్లు తీర్మానం చేశారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సత్యాయాదవ్‌ను శాలువాతో సన్మానించారు. రాబోవు సంవత్సరంలో అమ్మవారి ఆలయంలో గ్రానైట్ బండలు, ఆంజనేయస్వామి ఆలయంలో వివిధ అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానం చేశారు. సమావేశంలో అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కోషాధికారి లప్ప అశోక్, ఉపాధ్యక్షులు కన్న జగదీష్, శ్రీనివాస్, సుభాష్, శశికాంత్, రాధాకృష్ణ, నందు, రాంరెడ్డి, కిష్టప్ప, దినేష్‌లాహోటి, భాస్కర్‌రెడ్డి, నర్సింహులు, సురేఖ, సంధ్యారాణి, రాజేశ్వరీ, సువర్ణ పాల్గొన్నారు.



శివారు కాలనీలు.. సమస్యలకు నిలయాలు

- మౌలిక సదుపాయాలు కరువైన వైనం
- అధ్వానంగా మారిన డ్రెయినేజీలు, రోడ్లు



పల్లె వీధిలో..



శ్రీనగర్ కాలనీలో ఇళ్ల మధ్యే పారుతున్న మురుగు



యాద్గీర్ రోడ్డులో..

నారాయణపేట టౌన్ : జిల్లాకేంద్రంలోని శివారు కాలనీలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆయా కాలనీల్లోని ప్రజలు కనీస సదుపాయాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇక రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థల సంగతి సరేసరి. రహదారులు, మురుగు కాల్వలను అభివృద్ధి చేయకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఎక్కడికక్కడ మురుగు నిలుస్తుండడంతో అపరిశుభ్రత రాజ్యమేలుతోందని, దీనికి తోడు పందులు సంచరిస్తున్నాయని వాపోతున్నారు. దోమలు, ఈగలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వైర విహారం చేయడంతో నానావస్థలు పడుతున్నామని దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో శ్రీనగర్ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. దీంతో మురుగు ఇళ్ల మధ్యనే నిలుస్తోంది. కనీసం తాత్కాలిక ఏర్పాట్లు కూడా లేకపోవడంతో మురుగు రోడ్లపైనే పారుతోంది. చెత్త సేకరించే వాహనాలు రాకపోవడంతో కొంతమంది ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పారవేస్తున్నారని పలువురు వాపోతున్నారు. 9వ వార్డులోని యాద్గీర్ రోడ్ శివారులోనూ డ్రెయినేజీ వ్యవస్థలేక మురుగు రోడ్లపై పారుతోంది. కాలనీల్లో సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించిన అధికారులు పట్టించుకోవడం లేదని, ఇకనైన సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

విడతల వారీగా పరిష్కరిస్తున్నాం

పట్టణంలోని శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలుచోట్ల సమస్యలు పరిష్కరించాం. విడతల వారీగా చర్యలు తీసుకుంటున్నాం. డ్రెయినేజీలు లేని కాలనీల్లో పరిశీలించి త్వరలోనే నిర్మాణాలు చేపడుతాం. పూర్తయిన వెంటనే రహదారులు అభివృద్ధి చేస్తాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

సమస్యలు పరిష్కరించాలి



శ్రీనగర్ కాలనీ, అశోక్‌నగర్ సమీపంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపై పారుతోంది. పలుచోట్ల ఇళ్ల మధ్యనే నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. రహదారులు కూడా సరిగా లేవు. చెత్తసేకరించే వాహనాలు కూడా సరిగా రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– బాల్‌రాజ్ యాదవ్, నారాయణపేట

చేపల చెరువు ఏర్పాటుపై ఆందోళన

నర్వ: మండలంలోని పాథర్చేడ్ ఊర చెరువును చేపల చెరువుగా ఏర్పాటు చేసేందుకు కొంతమంది ప్రయత్నం చేస్తూ పనులు చేపట్టడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపల చెరువు ఏర్పాటైతే దాదాపు 70 మంది రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో చేపల చెరువు ఏర్పాటు చేస్తే దుర్గంధంతో పాటు రోగాలు ప్రబలే ఆస్కారం ఉంటుందని ఆందోళన పడుతున్నారు. వెంటనే పనులు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కొందరి స్వలాభం కోసం గ్రామానికి, రైతులకు నష్టం చేస్తామంటే ఊరుకోబోమన్నారు. తహసీల్దార్ దయాకర్‌రెడ్డికి విషయంపై ఫిర్యాదు చేశామని వివరించారు.

గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలి

మరికల్: పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించే సమయంలో అధికారులు గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని రైతులు శశిరెడ్డి, రాములు, కతలప్ప అన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుడారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఏటా గన్నీ బ్యాగుల కొరత ఉంటోందన్నారు. ఈ సారైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

‘రైతులకు పంట నష్టం అందజేస్తాం’



పంటలను పరిశీలిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లి, తళంకేరి , నేరడగండొడ్డి గ్రామాల పరిధిలోని రైతులు తాము వేసిన వరి పంటకు సాగు నీరు అందకపోవడంతో ఎండిపోయాయని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డిని దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆదివారం ఆయా గ్రామాల పరిధిలో ఆయన పర్యటించారు. పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులతో మాట్లాడారు. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి హైలెవల్ కెనాల్ పరిధిలో సాగు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయాయని, ఇప్పటికే అనేక నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఇలా జరగడం బాధకరమన్నారు. గ్రామాల పరిధిలో మూడెకరాలలోపు ఉండి నష్టపోయిన రైతులకు త్వరలోనే ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: గార్లపల్లిలో సొంత ఖర్చులు దాదాపు రూ. 50 వేలతో వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్ రెడ్డి బోరు వేయించారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉందని సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరడంతో స్పందించి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో అశోక్, సత్యరెడ్డి, తాయప్ప ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని పాట్లు



పాఠశాలలో వృథాగా ఆర్‌ఓ ప్లాంట్

మాగనూర్: మండలంలోని బైరంపల్లి ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సమస్య తాండవం చేస్తోంది. విద్యార్థులు తాగునీరు లభించక పోవడంతో నిత్యం అవస్థలు పడుతున్నారు. గతంలో ఓ దాత పాఠశాల విద్యార్థుల తాగునీటి కోసం ఒక ఆర్‌ఓ ప్లాంట్‌ను వితరణ చేయగా ప్రస్తుతం అది వృథాగా మారింది. వేసవి కాలం కావడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్‌ఓ ప్లాంట్‌ను వినియోగం లోకి తీసుకురావాలని లేదా ఇతర ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి తాగునీటి సమస్య రాకుండా చూడాలని కోరుతున్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రాంచంద్రయ్య స్నేహితులు

మద్దూరు: మిత్రుడి కుటుంబానికి స్నేహితులందరూ కలిసి ఆర్థిక సాయం చేసిన ఘటనిది. వివరాల్లోకి వెళ్తే ..కొత్తపల్లి మండలంలోని వీరారం గ్రామానికి చెందిన రామచంద్రయ్య(45) భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవలే గుండెపోటుతో అకస్మాత్తుగా ఆయన మృతి చెందాడు. దీంతో కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలోనే గుండుమాల్ ఉన్నత పాఠశాలలో (1990–91) రామచంద్రయ్యతో పదోతరగతి చదివిన మిత్రులు సాయం చేయడానికి ముందుకు వచ్చారు. మొత్తం రూ. 68 వేలు పోగు చేసి రామచంద్రయ్య భార్య రాములమ్మకు ఆదివారం గ్రామానికి వెళ్లి అందజేశారు. అదేవిధంగా భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కళాశాలకు ఆర్‌ఓ ప్లాంట్ వితరణ



సీఎస్‌ఆర్ డీసీలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.1.20లక్ష విలువగల వెయ్యి లీటర్ల సామర్థ్యం కల్గిన ఆర్‌ఓ ప్లాంట్‌ను వితరణ చేశారు. ఇదే కళాశాలలో చదువుకున్న మద్దూర్ మండలం రెనివట్లకు చెందిన పూర్వ విద్యార్థి బీజీ కనకప్ప ప్రస్తుతం నారాయణపేట మండలం జాజాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం సొంత డబ్బులతో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. ఈ మేరకు ఆదివారం ఫిట్టింగ్‌ను పూర్తి చేశారు. త్వరలో న్యాక్ బృందం పర్యటించనున్న నేపథ్యంలో ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రిన్సిపాల్ రంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నేడు కిష్టాపూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

నారాయణపేట/ధన్వాడ: ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ధన్వాడ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం పర్యటించనున్నారు. కూరగాయాల మార్కెట్, గ్రామ పంచాయతీ భవన శంకుస్థాపన , గ్రంథాలయం, రూ. 28 లక్షలతో నిర్మిస్తున్న కాజ్ వే నిర్మాణ పనుల శంకుస్థాపన, మన ఊరు, మన బడి పనుల ప్రారంభోత్సవం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న దళితులకు ముడు ఎకరాల భూముల లబ్ధిదారులకు పట్టాపాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాలో ఆయన ఎమ్మెల్యే పాల్గొననున్నారు.

‘పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం’



మాట్లాడుతున్న నాయకులు

ఊట్కూరు: బీజేపీ బలోపేతానికి కృషి చేద్దామని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి భాస్కర్ అన్నారు. ఆదివారం ఊట్కూరులోని వీరభద్రేశ్వర దేవాలయంలో బూత్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బూత్ కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రతి కార్యకర్త పోరాటం చేయాలని కోరారు. దళితమోర్చా రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్, ఎంపీటీసీ హనుమంతు, నాయకులు కృష్ణయ్యగౌడ్, ఆశప్ప, కొండన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి వదులుతున్న సిబ్బంది

నారాయణపేట రూరల్ : జిల్లాలో నిర్వహించిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంత వాతావరణంలో జరిగింది. జిల్లాలో ధన్వాడ, గుండుమాల్ మండలాల్లో రెండు మోడల్ స్కూల్స్ ఉండగా గతంలో ఆయా కేంద్రాల్లోనే పరీక్ష జరిగేది. తొలిసారిగా జిల్లా కేంద్రంలో నిర్వహించగా ఆయా విద్యార్థులకు రవితేజ, గురుకుల పాఠశాల కేంద్రాలను ఏర్పాటు చేశారు. 6వ తరగతి ప్రవేశాలతో పాటు 7 నుంచి 10వ తరగతి వరకు బ్యాక్‌లాస్ట్ సీట్లకు జరిగిన పరీక్షను రెండు భాగాలుగా నిర్వహించారు. ఉదయం వేళలో 6వ తరగతివారికి, మధ్యాహ్నం 7 నుంచి 10వ తరగతి వారికి 100మార్కుల ప్రశ్నపత్రంతో రెండు గంటల చొప్పున సమయం కేటాయించారు. దీనికిగాను మొదటి సెషన్‌లో 317 హాజరయ్యారు. రెండవ సెషన్‌లో 291 హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ లియాకత్ అలీ, పరీక్షల విభాగం అధికారి రాజేంద్రకుమార్, టాస్ కోఆర్డినేటర్ యాదయ్యశెట్టి పరిశీలించారు. సీఎస్, డీఓలుగా మహేష్, నారాయణరెడ్డి, శశికుమార్, సురేష్‌లు వ్యవహరించారు.

ఆలస్యంగా వచ్చి.. పరీక్ష రాయలేక..



ఆలస్యంగా వచ్చి గేటు దగ్గర పరీక్షకు అనుమతి కోరుతున్న విద్యార్థులు

ముందుగా పరీక్ష సమయాన్ని తెలియజేసినా చాలా మంది విద్యార్థులు నిర్దిష్ట సమయానికి హాజరుకాలేక పరీక్షను మిస్ అయ్యారు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళలో వచ్చిన వారు ఇతర చోట్ల ఉదయం గురుకుల పరీక్ష రాసి ఇక్కడికి రావడంతో ఆలస్యమైనట్లు వాపోయారు. ఒకే రోజు రెండు పరీక్షలను నిర్వహించడంతో ఇలా జరిగిందని, అధికారులు ఆలోచించి పరీక్షలను నిర్వహించాలని పేరెంట్స్ విమర్శించారు.

18న అభినందన సభ

నారాయణపేట రూరల్ : ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి ఈ నెల 18న నారాయణపేటకు రానున్నారు. గెలుపు సంబరాల్లో భాగంగా తపస్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5.30గంటలకు స్థానిక శీలగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో అభినందన సభ ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శేర్‌కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, పండిత్, పీఈటీలు, గురుకుల, కేజీబీవీ, మోడల్‌స్కూల్ టీచర్లు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

విరాళం అందజేత

మాగనూర్: మండల పరిధిలోని నల్లగట్టు మారెమ్మవ్వ దేవాలయం పునర్ నిర్మాణం చేస్తుండటంతో భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. మండలంలోని నేరడగం గ్రామస్తుడు ఉదయభాను ఆదివారం తమ వంతుగా ఆలయ కమిటీ సభ్యులకు రూ. 11 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించండి



యాంకి రహదారిపై వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు

నర్వ: మండలంలో ఇటీవల వరి కోతలు ముమ్మరంగా మొదలైనందువల్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు వరిని కల్లాల వద్దనే అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం సూచించిన ధరలు కాకుండా ఇష్టారీతిగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి దళారుల నుంచి మోసపోకుండా చూడాలని కోరుతున్నారు.

గొర్రెల దొంగలకు దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

మక్తల్: గొర్రెలు చోరీ చేసిన వారికి గ్రామస్తులు దేహశుద్ధి చేసిన ఘటనిది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని భూత్పూర్‌లో గొర్రెల కాపరులు ఆదివారం మందను నిలిపారు. ఈ క్రమంలో కొందరు ద్విచక్రవాహనాలపై వచ్చి మంద నుంచి దాదాపు పది గొర్రెలను ఎత్తుకెళ్లారు. గమనించిన కాపరులు గొర్రెలతో వెళ్తున్న ద్విచక్రవాహనాలను ఆపాలని ఫోన్‌లో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. దీంతో చోరీ చేసిన వారిలో కొందరిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. పోలీసులకు అప్పగించగా విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా చోరీ చేసిన వారిలో కొందరు పరారీ ఉన్నారని, వారు కొన్ని గొర్రెలను చందాపూర్‌లో వదిలి వెళ్లారని బాధితులు తెలిపారు. కాగా చోరీకి పాల్పడినవారు రాయ్‌చూర్ ప్రాంత వాసులని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



మక్తల్‌లో విందులో పాల్గొన్న నాయకులు



రేనివట్లలో ..

మద్దూరు: మండలంలోని రెనివట్ల జామామసీద్‌లో ఆదివారం మండల కాంగ్రెస్ నాయకుడు జి. రవి ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు రిజ్వాన్, ఇషాక్, నజుమోద్దీన్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మున్సిపల్ పరిధిలోని మసీద్ వద్ద ముస్లింలకు రాష్ట్ర పీసీసీ సభ్యుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కులమతాలతో సంబంధం లేకుండా సోదరభావంతో మెలగాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, నారాయణ, మందుల నరేందర్, శాంతి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైనా దాడిలో ఆవుదూడ మృతి

నారాయణపేట రూరల్ : హైనా దాడిలో ఆవుదూడ మృతి చెందిన ఘటనిది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పిల్లిగుండ్ల తండా పంచాయతీ పాత తండాకు చెందిన రైతు మాన్యానాయక్ తన పొలం వద్ద ఎప్పటిలాగే శనివారం రాత్రి ఆవుదూడను కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా ఆవుదూడ విగతజీవిగా పడి ఉండడం గమనించాడు. దగ్గరలోని గుట్టల నుంచి వచ్చిన హైనా ఆవుదూడను చంపేసినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేయాలి

మరికల్: మండలంలోని కన్మనూర్ శివారులో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు తర్వగా పూర్తి చేయాలని రైతు సంఘం నాయకులు నర్సిములు, రాములు, బాలప్ప ఆదివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన పనులు ఇప్పటికీ పూర్తి కావడం లేదని అంటున్నారు. దీంతో లోవోల్టేజీ సమస్య తీరడం లేదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడాలని వెంటనే సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేసి లోవోల్టేజీ సమస్య లేకుండా చేయాలని కోరుతున్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

నారాయణపేట టౌన్ : నూతనంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన కాకర్ల నారాయణమ్మ, భీమయ్య దంపతులను ఆదివారం 3వ వార్డు యువకులు గజమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కాకర్ల నారాయణమ్మ మాట్లాడారు. తమపై చూపిస్తున్న అనురాగం, మహోన్నతమైనవని అన్నారు. తనవంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తానని అన్నారు. నాగరాజ్, జంగిటి రాము, తిమ్మయ్య, పోలేమోని వెంకటేష్, రవికుమార్, మల్లేష్ పాల్గొన్నారు.